వర్షాభావంతో కౌలు రైతులు ఆందోళన..




PCW

తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి సందర్భంగా మేధావులతో సదస్సు 21న...




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 173 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 19 జూన్ 2026

## ఆధార్ కార్డు ఐడెంటిటీకి మాత్రమే పరిమితం చేయాలి

- పౌరసత్వం, నివాస ధృవీకరణ తదితరాలకు వాడరాదు
- పిటిషన్‌పై సుప్రీం విచారణ



**న్యూఢిల్లీ,జూన్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** ఆధార్ కార్డు వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది ఆధార్ కార్డులను పౌరసత్వం, నివాసం, అడ్రస్ ధృవీకరణకు ప్రూఫ్ గా వాడుతున్నారని, ఇది కేవలం ఐడెంటిటీ వెరిఫికేషన్‌కు మాత్రమే పరిమితం చేయాలని దాఖలైన పిటిషన్ ను విచారణకు చేపట్టిన సుప్రీంకోర్టు.. కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు వెంటను స్పందించాలని సుప్రీంకోర్టు కోరింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మో హనలతో కూడిన ధర్మాసనం, న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ పిటిషన్‌ను మిగతా2లో...

## హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం

- నేడు ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్




**హైదరాబాద్,జూన్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** నగరంలో జనసేన తెలంగాణ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించనున్నారు. శు క్రవారం మధ్యాహ్నం 12.00 గంటలకు మల్కం చెరువు సమీపంలోని పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభి స్తారు. ఈ నూతన కార్యాలయంతో తెలంగాణలో పార్టీ విస్తరణ కు పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టనున్నారని మిగతా2లో...



## వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం

- 30న రైతు భరోసా నిధులు విడుదల
- మధిర వేదికగా సిఎం రేవంత్ చేతుల మీదుగా అందచేత
- ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం
- కొనుగోళ్లలో కేంద్రం తీరుపై ఆగ్రహం
- కేబినేట్ భేటీలో పలు అంశాలపై చర్చ
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్,జూన్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది. 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి

మిగతా2లో...

## ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

- పేదల జోలికి వెళ్లకుండా..కబ్జాదారుల భరతం పడుతోంది ● హైదరాబాద్ కాలుష్యం నివారించేందుకే వనమహోత్సవం ● ఎవరు అడ్డుపడ్డా మూసీ ప్రక్షాళన కొనసాగుతుంది ● మూసీ మురికి కన్నా కల్వకుంట్ల విషం ప్రమాదం ● గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవం ● మొక్కను నాటి ప్రసంగించిన సిఎం రేవంత్ రెడ్డి



**రంగారెడ్డి,జూన్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతు న్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో మిగతా2లో...

## పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు

- కెటిఆర్ సిరిసిల్లకు విజిటింగ్ టూరిస్ట్
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు




## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా ముషాయిరా
- వేగంగా రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్,జూన్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యా భివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంద ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జె ట్‌లో భారీగా నిధుల ను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో

మిగతా2లో...

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

- 11శాతం ఫిట్‌మెంట్ అమలుకు నిర్ణయం
- జూలై 1 నుంచే అమలు చేస్తామన్న మంత్రి పొన్నం



**హైదరాబాద్,జూన్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం టీజీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మిగతా2లో...



## రామగుండం ఎరువులు మనకే కేటాయించాలి

- కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ వెళతాం
- ఒక్క మొక్కజొన్న గింజకూడా కొనని కేంద్రం
- రైతుబీమా పథకం కింద ఎల్ఐసికి బీమా మొత్తం చెల్లింపు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

**హైదరాబాద్,జూన్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** రామగుండం ఎరువులు పొందేలా కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ప్రతి నెల రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తామని అన్నారని.. కానీ హామీ ఇచ్చిన మేరకు కేంద్రం యూరియా సరఫరా ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఢిల్లీకి వెళ్లి సరిపడా యూరియా

మిగతా2లో...

## నెత్తురోడిన రాష్ట్ర రహదారులు

- వేర్వేరు ప్రమాదాల్లో 8మంది మృతి ● మేడ్చెల్ వద్ద ప్రమాదంలో ముగ్గురు మృతి ● వరంగల్ రహదారి ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం



**హైదరాబాద్,జూన్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలోని రహదారులు నెత్తురోడాయి. వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై మినీ ట్రక్కును లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ఎస్సై బండి శ్రవణ్

మిగతా2లో...

## కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్

- నేరగాళ్లకు అడ్డాగా మారిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ● కేంద్రప్రభుత్వం సంచలన ఆరోపణలు ● ఢిల్లీ హైకోర్టుకు నివేదిక సమర్పణ




**న్యూఢిల్లీ,జూన్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు చేసింది. ఈ యాప్‌ను 'కొత్త డార్క్ వెబ్'గా పేర్కొన్న కేంద్రం.. ఇది నేరగాళ్లకు అడ్డగా మారిందని ఆరోపించింది. సైబర్ నేరగాళ్లు, అతివాదులు, డ్రగ్ ముఠా సభ్యులు చట్టం నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్ ను ఎక్కువగా వినియోగిస్తున్నారని దుయ్య బట్టింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో దేశంలో టెలిగ్రామ్ వినియోగంపై కేంద్రం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా కేంద్రం గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షకు

మిగతా2లో...

# ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో



కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్ గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

# మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ... అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ఒక నిర్ణీత టైమ్ క్యాలెండర్‌ను రూపొందించుకుని, దాని ప్రకారమే పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, మిగిలిన 17 పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు మరియు వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా రూ. 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులను క్రిస్టియన్ మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి కేటాయిస్తామన్నారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ్ మరియు ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మైనార్టీల స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

# వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు ఖరీఫ్, రబీ కాలంలో విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మరోవైపు.. 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లు, వీబీజీ రాంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై మంత్రులతో చర్చలు జరిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు.

# రామగుండం ఎరువులు మనకే కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతామని పేర్కొన్నారు. కేంద్రం ఎంఎస్పీ ప్రకటించి కొనుగోలు నుంచి తప్పుకుంటుందని మంత్రి తుమ్మల విమర్శించారు. ఒక్క గింజ మొక్కజొన్నని కూడా కేంద్రప్రభుత్వం ఎందుకు కొనలేదని నిలదీశారు. ఈ విషయాన్ని తెలంగాణ రైతాంగంపై కక్ష అనుకోవాలా అన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్తామని స్పష్టం చేశారు. తొలకరి వర్షానికే విత్తనాలు వేస్తే రైతులు నష్టపోతారని చెప్పారు. రెండుసార్లు వర్షం పడితేనే సరిపడా తడి వస్తుందని.. అన్నదాతలు ఈ విషయాన్ని గమనించా లని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇకపోతే రైతు మరణించిన సందర్భంలో వారి కుటుం బాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం అత్యంత బాధ్యతతో అమలు చేస్తోందన్నారు. ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందన్నారు. ల్గ÷తు బీమా పథకాన్ని నిలిపివేసినట్లు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని మంత్రి తుమ్మల అన్నారు. రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిన దాఖలాలు లేవని, పథకాలను నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర గత ప్రభుత్వానిదే అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యాంత్రీకరణ, సాయిల్ హెల్త్ టెస్ట్, సబ్సిడీపై విత్తనాలు వంటి పథకాలను నిలిపివేయడమే కాకుండా స్టేట్ వాటాను విడుదల చేయకుండా కేంద్ర ప్రాయోజిత పథకాలను సైతం రైతులకు దూరం చేసిందని విమర్శించారు. మా ప్రభుత్వం అధికారం లోకి రాగానే గత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ను ఎలాంటి బేషజాలకు పోకుండా అమలు చేయడమే కాకుండా.. గత ప్రభు త్వం ఆపేసిన పథకాలను పునరుద్ధరిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు.

## కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన కొన్ని ముఠాలు టెలిగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల దీనిపై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది.ఈ సందర్భంగా క్రిమినల్ నెట్‌వర్క్‌లు, అతివాద ముఠాలు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరును కేంద్రం అందులో వివరించింది. గోప్యతకు సంబంధించి టెలిగ్రామ్‌లో ఉన్న అధునాతన ఫీచర్లు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. ఇందులోని ప్రైవసీ సెట్టింగ్‌లతో యూజర్లు తమ టెలిగ్రామ్ ఐడీలు, ఫోన్ నంబర్లు వంటి గుర్తింపు వివరాలను దాచిపెట్టేందుకు వీలు లభిస్తోంది. ఇది కొత్త డార్క్ వెబ్‌గా మారింది. క్రిమినల్స్ డార్క్ వెబ్ లింక్‌లతో పరస్పరం అనుసంధానం చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వారిని ట్రాక్ చేయలేక పోతున్నారని కేంద్రం తమ అఫిడవిట్‌లో ఆరోపించింది. ఇక, హింసాత్మక, తీవ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్లను ఉపయోగిస్తున్నారని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది.

## ఆధార్ కార్డు ఐడెంటిటీకి మాత్రమే పరిమితం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

విచారించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఆధార్‌ను ఐడెంటిటీ ప్రూఫ్ గా మాత్రమే వాడాలని పౌరసత్వం, నివాసం, అడ్రస్, పుట్టిన తేదీకి సంబంధించిన రుజువుగా వినియోగించకుండా కేంద్ర, రాష్ట్ర, ఎన్నికల సంఘాలకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు పిటిషనర్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ్. ఓటరు నమోదుకు బర్త్ డేట్, రెసిడెంట్ ప్రూఫ్ లకు ఆధార్ కార్డును వినియోగిస్తున్నారని, ఇది ఆధార చట్టానికి విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 'ఆధార్ పౌరసత్వానికి లేదా రెసిడెంట్ కు ప్రూఫ్ కాదని స్పష్టంగా తెలిపింది ఉడాయ్. అయినప్పటికీ, ఆధార్‌ను స్కూల్ అడ్మిషన్లు,ప్రాపర్టీ కొనుగోలు, బర్త్ ప్రూఫ్ రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పొందడం కోసం వయస్సు, పౌరసత్వం, నివాస ధృవీకరణ పత్రంగా ఉపయోగించడమే కాకుండా, కొత్త ఓటరు నమోదుకు, పుట్టిన తేదీకి, నివాస ధృవీకరణ పత్రంగా కూడా వాడుతున్నారు. ఈ విధంగా, చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్‌ను ఉపయోగించి వివిధ డాక్యుమెంట్లను పొందుతున్నారని పిటిషన్‌లో కోర్టుకు తెలిపారు. ఎన్నికల పక్రియలలో ధృవీకరణ వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేయాలని, సంస్కరణలను పర్యవేక్షించేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో పాటు సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు.

## హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఇప్పటికే రాష్ట్రంలోని జనసైనికులు, వీరమహిళలు, నాయకులకు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి భారీగా జనసైనికులు తరలి వస్తారని నేతలు అంచనా వేస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన కార్యకలాపాలకు ఈ నూతన కార్యాలయం కేంద్రంగా మారనుందనే ప్రచారం సాగుతోంది. ఈ కొత్త కార్యాలయం ఏర్పాటు తర్వాత.. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, చేరికలపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫోకస్ చేస్తారని తెలుస్తోంది.

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు టీజీఎస్ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు. పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయనున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం జరగనుందని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

## పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు

**కరీంనగర్,జూన్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రాంతీయవాదాన్ని వేర్పాటువాదంతో పోల్చిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కేసు పెట్టలేదని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. కేసు పెట్టడం చేతగాని ప్రభుత్వం తెలంగాణలో ఉందని విమర్శించారు. కరీంనగర్‌లో తెలంగాణ రక్షణ సేన జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ విషయాన్ని ప్రాధాన్యత లేని అంశంగా భావిస్తోందన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక పలువురు నేతలు తెలంగాణ భావజాలంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యమానికి అండగా నిలిచిన కరీంనగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం ప్రజల త్యాగాలను అవమాన పరిచినట్లేనని కవిత అన్నారు. ఇకపోతే మాజీమంత్రి కేటీఆర్‌పై కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ సిరిసిల్లాకు వీకెండ్‌లో వచ్చి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో కవిత పర్యటించి. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ రైతన్నల నడ్డి విరిస్తే కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. సిరిసిల్లలో సెస్ ఆగమాగం అయితే కేటీఆర్ ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. రైతు డిస్కంలపై ఇప్పటి వరకు కేటీఆర్ ఎందుకు నోరెత్తలేదని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. రైతు డిస్కం కావాలో, వద్దో ఆయన ఎందుకు చెప్పలేదని నిలదీశారు. నేరెళ్లలో అక్రమ ఇసుక సంపాదన కోసం దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ధ్వజమెత్తారు. నేరెళ్ల బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. నేరెళ్ల ఇసుక బాధితుల తరపున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కార్పొరేటర్‌గా వచ్చి.. నేరెళ్ల బాధితుల ఓట్లతో బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యారని కవిత పేర్కొన్నారు.

## నెత్తురోడిన రాష్ట్ర రహదారులు

(మొదటి పేజీ తరువాయి)

కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలంలో కిరాణా దుకాణం నిర్వహించే జాట్ రోహిత్, యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండ కొత్తపల్లికి చెందిన మధు.. టాటా ఏస్ మినీ ట్రక్కులో హైదరాబాద్ నుంచి కిరాణా సామగ్రి తీసుకొస్తుండగా.. తెల్లవారుజామున జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం నెల్లుట్ల సమీపంలోకి రాగానే ట్రక్కు టైరు పంక్చర్ అయింది. అదే దారిలో వెళ్తున్న లారీని ఆపి జాకీ తీసుకున్నారు. లారీ క్లీనర్ రాజేందర్, ట్రక్కు డ్రైవర్ మధు, కిరాణా దుకాణ యజమాని రోహిత్.. పంక్చర్ అయిన టైరును మారుస్తున్న క్రమంలో వెనుక నుంచి మరో లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు జనగామ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పరిధిలోని తుర్కపల్లి–మురహరిపల్లి మధ్య ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఆ తర్వాత అతి వేగంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కారులో నుంచి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ ప్రమాదంతో హైవేపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు యత్నించారు. వికారాబాద్‌జిల్లా పరిగి మండలం చిగురాల్‌పల్లి వద్ద బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోమిన్‌కలాన్‌కు చెందిన జావీద్‌పాషా (30) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారు, డీసీఎం వ్యాన్ సిరిసిల్ల బైపాస్‌పై ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అభిషేక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న వారిది జగిత్యాలగా తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స

# వర్షాభావంతో కౌలు రైతులు ఆందోళన..

## వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన..?







**తిమ్మాపూర్, జూన్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం నుస్తులాపూర్ మండలం, నల్లగొండ గ్రామంలో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పత్తి పంట విత్తనాలు మొలకెత్తినప్పటికీ ఎదుగుదల సరిగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో వరి నాట్ల మార్పిడి (ట్రాన్స్‌ప్లాంటేషన్) సమయం దగ్గరపడింది. ప్రస్తుతం సుమారు 20 రోజుల వయస్సు గల వరి నాట్లు నాటేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, వర్షాభావం కారణంగా పొలాల్లో నీరు లేక రైతులు నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో నాట్లు ముదిరిపోయి నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి విత్తనాలు, ఎరువులు, కూలీల కోసం ఖర్చు చేశారని, పరిస్థితి ఇలాగే కొనసాగితే తీవ్ర ఆర్థిక నష్టాలు తప్పవని చెబుతున్నారు. అయితే, ఈ క్లిష్ట పరిస్థితుల్లో వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించకపోవడమే కాకుండా, రైతులకు ఎలాంటి సాంకేతిక సూచనలు లేదా మార్గదర్శకాలు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి పంటల పరిస్థితిని అంచనా వేసి అవసరమైన సలహాలు అందించాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, అవసరమైతే ప్రత్యేక ఆర్థిక సహాయం అందించి కౌలు రైతులను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేకపోతే ఈ ఖరీఫ్ సీజన్‌లో భారీ పంటనష్టం సంభవించే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఉద్యమ స్ఫూర్తిని చెరిపేసే కుట్ర

## తెలంగాణ భావజాలంపై ప్రభుత్వం దాడి

## పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

## టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత





**కరీంనగర్ టౌన్ జూన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి గౌరవిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రెండున్నరేళ్లు గడిచినా ఒక్క హామీని కూడా అమలు చేయలేదని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత విమర్శించారు. కరీంనగర్‌లో నిర్వహించిన ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఉద్యమకారుల సమస్యలపై పోరాటం చేస్తుంటే ప్రభుత్వం కమిటీలు వేసి కాలయాపన చేస్తోందని, అమరుల కుటుంబాలకు అండగా నిలవడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. జార్ఖండ్ తరహాలో తెలంగాణ ఉద్యమకారులకు రాయితీలు, రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా స్పందన లేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ భావజాలంపై దాడి చేస్తోందని కవిత ఆరోపించారు. రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయుల ఆనవాళ్లను తొలగించడం, తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం, బతుకమ్మకు ప్రాధాన్యత తగ్గించడం వంటివి తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలని విమర్శించారు. అసెంబ్లీలో చర్చ లేకుండానే తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం, ఉద్యమ కాలం నాటి చారిత్రక గుర్తులను తొలగించడం ఉద్యమ స్ఫూర్తిని అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రవీంద్రభారతిలో కళాకారులకు ప్రాధాన్యత పెంచాలని, గద్దర్ పేరుతో అవార్డుల కంటే జానపద అకాడమీ ఏర్పాటు చేసి కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. **పవన్ కళ్యాణ్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి** రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమాన్ని వేర్పాటువాదంతో పోల్చడం ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని, అటువంటి వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలపై ఉద్యమ శక్తులు మరింత సంఘటితం కావాలని, భవిష్యత్ కార్యాచరణలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

# విద్యుత్ అంతరాయాల పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు



## - వర్షానికి పడిపోయిన కరెంట్ స్తంభాలకు పూర్తిస్థాయి మరమ్మత్తులు

## - విద్యుత్ సమస్యల కోసం 24 గంటల టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలి:జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్






**ఖమ్మం ప్రతినిధి, జూన్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లాలో ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలు, బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపుల ప్రభావంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ లైన్ల ద్వారా విద్యుత్ అందించే చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి పర్యవేక్షణలో విద్యుత్ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారు. రోజువారీగా వీచే బలమైన గాలులు, దుమ్ము తుఫాన్లు, అకాల వర్షాల కారణంగా విద్యుత్ లైన్లు తెగిపోవడం, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు దిమ్మలపై నుంచి కింద పడిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఈ ఘటనలు రాత్రి సమయంలో ఎక్కువగా సంభవించడం వల్ల మరమ్మతు పనుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ, విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం శ్రమిస్తూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సూచనలతో బుధవారం రాత్రి వర్షాలు, ప్రతికూల వాతావరణం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాల ప్రభావంతో ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా కొత్తగూడెం-అల్లీపురం రోడ్, దంసలాపురం కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి దెబ్బతిన్న స్తంభాలు, లైన్ల మరమ్మతు పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.వ్యవసాయ బావులకు సంబంధించిన విద్యుత్ లైన్లు పొలాల్లో ఉండటం వల్ల రాత్రి సమయంలో మరమ్మతు పనులు చేపట్టడం భద్రతాపరంగా సాధ్యం కాని సందర్భాలు ఉంటాయని అధికారులు తెలిపారు. అలాంటి ప్రాంతాల్లో మరుసటి రోజు ఉదయం ప్రత్యేక బృందాలతో పనులు నిర్వహించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. తెగిపోయిన విద్యుత్ తీగలు, కూలిపోయిన విద్యుత్ స్తంభాలు లేదా దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు కనిపించినప్పుడు వాటికి దూరంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని తాకరాదని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలను వెంటనే సంబంధిత సెక్షన్ అధికారి, సమీప సబ్‌స్టేషన్ లేదా విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యుత్‌కు సంబంధించిన ఏవైనా ఫిర్యాదులు, అత్యవసర పరిస్థితులు లేదా సేవలకు సంబంధించిన సమస్యల కోసం 24 గంటల పాటు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు జిల్లా యంత్రాంగం, విద్యుత్ శాఖ సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

# ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి సందర్భంగా మేధావులతో సదస్సు 21న...

## ● బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి..



**కరీంనగర్ జిల్లా జూన్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, ఈ నెల 21న కరీంనగర్లో "మేధావులతో సదస్సును నిర్వహిస్తున్నట్టు బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం రోజున కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో బిజెపి ముఖ్య నేతలతో కలిసి మేధావుల సదస్సు ఆహ్వాన పత్రికను జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లుగా దేశంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, గ్లోబల్ స్థాయిలో భారతదేశం సాధించిన ప్రగతిని విశ్లేషించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ సదస్సుకు జిల్లాలోని విద్యావేత్తలు, వివిధ వృత్తులకు చెందిన నిపుణులు, మేధావులు పౌరసమాజ ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. . దేశ గమనాన్ని, భవిష్యత్తు ప్రణాళికలు, దేశ ఆర్థిక ప్రగతి, మౌలిక వసతుల కల్పన, డిజిటల్ ఇండియా, సామాజిక భద్రతా పథకాలపై మేధావులు తమ అభిప్రాయాలను సదస్సులో వ్యక్తం చేసే విధంగా ఈ ప్రోగ్రాం జరుగుతుందన్నారు. జిల్లాలోని మేధావులు ,పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై , విజయవంతం చేయాలని గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ప్రోగ్రాంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి,రాష్ట్ర నాయకులు ఇనుగోండనాగేశ్వర్ రెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, పుప్పాల రఘు, అడిచర్ల రాజు, జగన్ రెడ్డి, ఆకుల రాజేందర్, విమల్, నరేష్ లతోపాటు కార్పొరేటర్ బండ రమణారెడ్డి పాల్గొన్నారు.

# జూన్ 2 ఉద్యమకారుల భూ పోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: సోను భాయ్





**హైదరాబాద్ జూన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయతులో జూలై 2 ఉద్యమకారుల భూ పోరాట కార్యక్రమము పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగా ఉద్యమకారుల సంఘాలతో కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసి పునరీకరణ చేయడం జరుగుతుంది.ఇందులో భాగంగా బహదూర్పుర ఇన్చార్జి సోను భాయ్ ఆధ్వర్యంలో ఉద్యమకార భూ పోరాటానికి సంబంధించి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది, ఈ యొక్క సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇంటి స్థలం ఇచ్చేంత వరకు మా పోరాటం ఆగదని ఉద్యమకారులందరూ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ యొక్క సమావేశానికి ప్రోగ్రాం గ్రేటర్ హైదరాబాద్ ఇన్చార్జ్ దుగుంట్ల నరేష్ ప్రజాపతి, తెలంగాణ ఉద్యమకారుల పోరాట సమతి రాష్ట్ర అధ్యక్షులు మల్లూరి అనిల్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షులు రామగిరి ప్రకాష్, బీరకాయల మధుసూదన్,గౌరీ గణేష్, కోప్ప శ్రీనివాస్ గౌడ్, రామ్ కోటి, ప్రజాపతి గోపు సదానంద్ ,కొప్పుల అర్జున్ పాల్గొన్నారు.

# ట్రాన్స్ఫారం వైరుకు తలిగి కరెంట్ షాక్‌తో మృతి చెందిన మేక

## - ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంచ లేకపోవడం విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం ఉంటున్న స్థానికులు?.

## - అధికారుల స్పందించి కంచన్ ఏర్పాటు చేయండి



**తొర్రూరు ప్రతినిధి, జూన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** మేతకు వెళ్లిన మేక మృత్యువాతకు గురైందని తెలిసిన యజమాని తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని చెర్లపాలెం గ్రామం లో మేతకు వెళ్లిన మేక విద్యుత్ ట్రాన్స్ఫారానికి చుట్టూ కంచ లేకపోవడంతో అదే వైరుకు పచ్చడి ఆకులు కనిపించడం మేసేందుకు వైర్ వద్దకు వెళ్లి తినే సమయంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడిందని గొర్ల కాపరి జంగిడి కుమార్ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఆర్థికంగా లేని జంగిడి కుమార్ కు నష్టం జరిగిందని విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి తనకు ఆర్థిక సహాయం అందించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. భవిష్యత్తులో మరే మూగజీవైన మనుషులకైనా విద్యుత్ షాక్ తగలకుండా ఉండాలంటే ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంచెను నెలకొల్పాలని అంటున్నారు. వచ్చేది వర్షాకాలం కావడం వలన ఎవరికైనా ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నందున వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసిన కలెక్టర్‌కు ఎంఐఎం నేతల కృతజ్ఞతలు




**కరీంనగర్ టౌన్ జూన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఓటర్లకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఇటీవల ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించిన నేపథ్యంలో, ఆ విజ్ఞప్తికి వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినందుకు ఎంఐఎం కరీంనగర్ టౌన్ అధ్యక్షులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తో పాటు ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులు, కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ ఐ ఆర్ హెల్ప్ డెస్క్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను ఆయన అభినందించారు.ఓటర్ల వివరాల పరిశీలన, నమోదు, మార్పులు, సవరణలు మరియు ఇతర సందేహాలకు సంబంధించి జిల్లా స్థాయిలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై స్పందించి తక్షణ చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్ కు ఎంఐఎం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో... ఎంఐఎం కో కార్పొరేటర్ ఇబ్రహీం, కార్పొరేటర్ మాజీద్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్లు ఆరిఫ్ అహ్మద్, లింగంపల్లి శ్రీను, కంటెస్టెడ్ కార్పొరేటర్లు అబ్దుల్ గఫార్, వాజిద్ అలీఖాన్, సురేష్, నాయకులు మేరాజ్, షాకిర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ధృవపత్రాల జారీని 2-3 రోజుల్లో పూర్తి చేయాలి..

## డీఆర్వో స్వామికి, ఎంఐఎం నేతల వినతిపత్రం

**కరీంనగర్ టౌన్ జూన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థుల ప్రవేశాల సీజన్ సందర్భంగా అర్బన్, రూరల్, కొత్తపల్లి మండల తహసీల్దార్ (ఎంఆర్వో) కార్యాలయాల్లో ధృవపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేసి, దరఖాస్తు చేసిన 2 నుండి 3 రోజులలోపు విద్యార్థులకు ధృవపత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎఐఎంఐఎం కరీంనగర్ టౌన్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) జె. స్వామికి గురువారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ జూన్, జూలై, ఆగస్టు నెలల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు



కుల, ఆదాయ, నివాస, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, గ్యాప్, ఇతర విద్యా సంబంధిత ధృవపత్రాల కోసం పెద్ద సంఖ్యలో రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు.విద్యార్థుల అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ ప్రవేశాలు తదితర అవసరాల కోసం ఈ ధృవపత్రాలు అత్యవసరమని, జాప్యం కారణంగా అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అర్బన్, రూరల్, కొత్తపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి, ధృవపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేసి, దరఖాస్తు చేసిన 2 నుండి 3 రోజులలోపు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడం ద్వారా రెవెన్యూ శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో... ఎంఐఎం కో కార్పొరేటర్ ఇబ్రహీం, కార్పొరేటర్ మాజీద్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్లు ఆరిఫ్ అహ్మద్, లింగంపల్లి శ్రీను, కంటెస్టెడ్ కార్పొరేటర్లు అబ్దుల్ గఫార్, వాజిద్ అలీఖాన్, సురేష్, నాయకులు మేరాజ్, షాకిర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధిలో భాగంగా పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్







**కరీంనగర్ జిల్లా జూన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గురువారం 6వ డివిజన్ బొమ్మకల్ ప్రాంతంలో నిర్వహిస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు శానిటేషన్ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.అనంతరం 17వ మరియు 18వ డివిజన్లలో చేపడుతున్న మంచినీటి బావి తవ్వకం పనులను మేయర్ ప్రారంభించారు. నగర ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు.ఈ సందర్భంగా ఆధునీకరించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ప్రైమరీ హెల్త్ సెంటర్) భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఆరోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.అలాగే ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీలలో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించి, పనులు నాణ్యతతో మరియు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్లు మేకల వెంకటేష్, వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్, అడిషనల్ కమిషనర్ సువార్త, మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# దొర గారి మెప్పు కోసమే కొప్పుల, ఆర్ఎస్పీ ఆరాటం..

- కేసీఆర్ అవమానించినప్పుడు దళితుడిగా కొప్పులకు అండగా నిలిచిన..
- దోచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు..
- కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జీవన్ రెడ్డి వాట ఎంతో చెప్పాలి..
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..



**కరీంనగర్ టౌన్ జూన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** హరీష్ రావు దొర మెప్పు పొందడానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో దొరలు అవమానించినప్పుడు కొప్పుల ఈశ్వర్ కు సాటి దళితుడిగా అండగా నిలిచానని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దోచుకోవడం దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు అని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో జీవన్ రెడ్డికి వచ్చిన వడ్ల కమీషన్ ఎంతో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిధి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ఏడాది క్రితం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా తాను బాధ్యతలు తీసుకున్నానని మంత్రి అడ్లూరి అన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పని చేశారని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల పాఠశాల కార్యదర్శిగా పని చేశారని ఏడాది కాలంగా ఎందుకు ఆయా శాఖలపై మాట్లాడలేదని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. సంక్షేమ శాఖలో రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని హరీష్ రావు ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని మంత్రి అడ్లూరి అన్నారు. సంక్షేమ శాఖకు సంబంధించి విద్యార్థులకు కావాల్సిన వస్తువుల కొనుగోలుకు రూ. 683 కోట్లతో టెండర్లు పిలిచామని, రూ. 500 కోట్లతో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ల ఖారారు చేశామని మంత్రి అడ్లూరి తెలిపారు.మొత్తం రూ. 1183 కోట్లకు టెండర్లు పిలిస్తే మాజీ మంత్రి హరీష్ రావు రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పానని మంత్రి అడ్లూరి అన్నారు. తాను జవాబు చెప్పితే దొరగారి మెప్పు కోసం కొప్పుల ఈశ్వర్ ఖాబ్దార్ అని మాట్లాడు తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొప్పుల ఈశ్వర్ కు అవమానం జరిగితే తాను సాటి దళితుడిగా ఆరోజు ప్రతిపక్షంలో ఉండి అండగా నిలిచానని మంత్రి అడ్లూరి అన్నారు. 2018 ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ ఏలా గెలిచాడో తెలంగాణ ప్రజలందరికి తెలుసని అన్నారు.

కొప్పుల మంత్రిగా ఉన్న సమయంలో ఈవీఎంలు భద్రపరిచిన స్టాంగ్ రూం తాళం పోతే ఎక్కడ పోయిందని అడిగితే మంత్రి ఉన్న కొప్పుల ఈశ్వర్ సమాధానం చెప్పాలేదని మంత్రి అడ్లూరి అన్నారు. కొప్పులపై తాను 2009లో పోటీ చేస్తే కేవలం1165ఓట్ల తేడాతో ఓడిపోయానని, 2014లో 16వేల మెజార్టీతో ఓడిపోయానని, తెలంగాణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు పోటీ చేసిన సమయంలో రాష్ట్రంలో ఎవ్వరికి డిపాజిట్ రాలేదని తనకు మాత్రమే డిపాజిట్ వచ్చిందని మంత్రి అడ్లూరి గుర్తు చేశారు. ధర్మపురి ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గానికి ఏమీ చేయలేదని మంత్రి అడ్లూరి అన్నారు. ధర్మపురికి డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్, ఆర్టీసీ బస్సు డిపో ఏమీ తీసుకురాకపోవడంతోనే 2023 ఎన్నికల్లో ఈశ్వర్ కు ప్రజలు బుద్ధి చెప్పారని మంత్రి అడ్లూరి అన్నారు. 2024 పార్లమెంట్ఎన్నికల్లో సైతం ధర్మపురి నియోజకవర్గ ఓటర్లు కొప్పులకు ఓట్లే వేయలేదని మంత్రి అడ్లూరి తెలిపారు.దోచుకోవడం దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు అని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గతంలో సంక్షేమ శాఖ మంత్రిగాఉన్న కొప్పుల, గురుకుల కార్యదర్శిగా ఉన్న ప్రవీణ్ కుమార్ కలిసి దోచుకున్నారు కనుక ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. జీవన్ రెడ్డి వాటాఎంతో చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వడ్ల కొనుగోలులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారని, జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సీజన్లలో వడ్లు కొనుగోలు చేసిందని, మరి అప్పుడు జీవన్ రెడ్డికి ఎంత కమీషన్ వచ్చిందో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

# ఆధ్యాత్మిక, మహిమాన్విత, అమ్మవార్ల దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయ షోడశ (16వ) వార్షికోత్సవం నేడు..

**ముస్తాబైన శ్రీ మహాశక్తి దేవాలయం...శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో వార్షికోత్సవ వేడుకలు, పూజలు.**

**వేడుకలకు హాజరుకానున్న కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్.**








**కరీంనగర్ జిల్లా జూన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో అత్యంత ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతు, కరీంనగర్ ప్రజల ఆరాధ్య దైవం, మహిమాన్విత శక్తి స్వరూపులైన శ్రీ మహాదుర్గా, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లతో కొలువుదీరి భక్తుల పాలిట కొంగుబంగారంగా మారిన దివ్య పుణ్యక్షేత్రం "శ్రీ మహాశక్తి దేవాలయ" షోడశ (16వ) వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమైంది. 19 వ తేదీ శుక్రవారం రోజున జరగనున్న వార్షికోత్సవ వేడుకల కోసం ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో అత్యంత వైభవంగా వేడుకలను, ప్రత్యేక పూజా కార్యక్రమాలను శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి దివ్య ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. వార్షికోత్సవ వేడుకలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ హాజరుకానున్నారు. వార్షికోత్సవం రోజైన శుక్రవారం (జూన్ 19) నాడు ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక విశేష పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించనున్నారు.ఉదయం 4:30 నిమిషాలకు జగద్గురువుల కరకమలములచే శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారికి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు, అనంతనాగేంద్ర స్వామి వారికి అత్యంత వైభవంగా అభిషేక పూజలు ,ఉదయం 8:00 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనము, గణపతి పూజ, అఖండ దీపారాధనము, సర్వతోభద్ర మండల పూజలతో పాటు లోకకల్యాణార్థం లక్ష్మీగణపతి హోమము, రుద్ర సహిత చండీ హోమము, పూర్ణాహుతి, మంత్రపుష్పం అనంతరం జగద్గురువుల అనుగ్రహ భాషణం (ఆశీర్వచనం), తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం ఉంటుంది.**త్రిశక్తుల స్వరూపం – మహిమాన్విత దివ్య క్షేత్రం "శ్రీ మహాశక్తి దేవాలయం** ఒకే దేవాలయ ప్రాంగణంలో అత్యంత శక్తివంతమైన ముగ్గురు అమ్మవార్లు త్రిశక్తి రూపంలో భక్తులకు దర్శనమిచ్చే అరుదైన పుణ్యక్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం.శ్రీ మహాదుర్గ : భక్తులకు రక్షణను, ధైర్యాన్ని ప్రసాదించే శక్తి స్వరూపిణి.శ్రీమహాలక్ష్మి:లిఅష్టైశ్వర్యాలను, కుటుంబ సౌఖ్యాన్ని, వ్యాపార వృద్ధిని ఇచ్చే లక్ష్మీదేవి.లిశ్రీ మహాసరస్వతి: చదువుల తల్లి, జ్ఞానాన్ని ప్రసాదించే విద్యా స్వరూపిణి. ల ఆధ్యాత్మిక నిలయం శక్తివంతమైన పూజా విధానాలతో అలరారే ఈ ఆలయం భక్తులకు నేడు సమస్త భక్తుల పాలిట కొంగు బంగారంగా మారింది. 15 ఏళ్ల భక్తుల అచంచల విశ్వాసంతో ఈ ఆలయం కరీంనగర్ జిల్లాలోనే కాకుండా ఉత్తర తెలంగాణలోనే ఒక ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా ఎదిగింది. ఇక్కడి అమ్మవారిని దర్శించుకుని మనసారా మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని, ముఖ్యంగా వ్యాపార వృద్ధి, చదువు, కుటుంబ సౌఖ్యం కలుగుతాయని భక్తుల బలమైన నమ్మకం. అమ్మవారి ఆశీస్సులతో భక్తుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న క్షేత్రంగా శ్రీ మహాశక్తి దేవాలయం ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా దేవాలయంలో కన్నుల పండుగగా అనేక ప్రధాన ఉత్సవాలు, పండుగ వేళల్లో ఉగాది, శ్రీ సీతారాముల కళ్యాణం, వసంత పంచమి, మహాశివరాత్రి, సంకటహర చతుర్థి, శ్రావణ మాస ప్రత్యేక పూజలు, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, వినాయక నవరాత్రులు, దీపావళి , తులసి కళ్యాణం, అయ్యప్ప స్వామి పడిపూజ , మార్గశిర మాసం- ధనుర్మాసం, రుద్ర సహిత చండీ హోమం, నాగుల పంచమి, చవితి లాంటి పర్వదినాల్లో ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ప్రధానంగా దసరా నవరాత్రి ఉత్సవాలు ఇక్కడ అత్యంత వైభవంగా జరుగుతాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరిస్తారు. ఈ సమయంలో ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ సంబరాలు, అన్నదానాలు భారీ ఎత్తున దాండియా నృత్యాలు ఘనంగా ప్రతిఏటా నిర్వహిస్తారు. అలాగే విజయదశమి సమయంలో ఇక్కడ భవానీ మాల ధరించిన దీక్షాపరుల కోలాహలం ఎక్కువగా ఉంటుంది. విజయవాడ తర్వాత అదే స్థాయిలో భవాని మాల ధారులకు శ్రీ మహాశక్తి దేవాలయం ఆధ్యాత్మిక కేంద్ర బిందువుగా మారింది అనడంలో అతిశయోక్తి లేదు. ప్రతి ఏటా వేలాదిమంది దీక్షపరులు ఇక్కడ భవాని మాల ధారణ చేస్తున్నారు. ప్రముఖ రాజకీయ, సామాజిక నాయకులు సైతం ఇక్కడ దీక్షలు చేపట్టడం విశేషం.శ్రీ మహాశక్తి దేవాలయంలో నిర్వహించే విశిష్ట పూజలు, భక్తి ప్రపత్తులకు నిలయమైందివిశేష పూజలకు, పర్వదినాల ఆధ్యాత్మికతకు, భక్తికి చిరునామాగా నిలుస్తున్న శ్రీ మహాశక్తి దేవాలయం భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతోంది. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు ప్రతిరోజూ అశేష సంఖ్యలో తరలివచ్చే ఈ క్షేత్రంలో, విశేష పర్వదినాల్లో నిర్వహించే పూజా కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.దేవాలయంలో నిర్వహించే వేడుకలు పర్వదినాల్లో కోరికలను తీర్చే శ్రీ మహాశక్తిని దర్శించుకుని, విశేష పూజలలో పాల్గొని అమ్మవారి పరిపూర్ణ అనుగ్రహాన్ని భక్తులు పొందుతుంటారు. ఈనెల 19, శుక్రవారం రోజున జరిగే ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో, పూజా కార్యక్రమాలలో కూడా హిందూ బంధువులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, త్రిశక్తి స్వరూపులైన శ్రీ మహాశక్తి దేవాలయ అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# రుద్రమకోటలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠా కార్యక్రమం

**● భక్తిశ్రద్ధలతో పాల్గొన్న సురేష్‌వైష్ణవి దంపతులు**




**రుద్రమకోట, జూన్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బొడ్రాయి కార్యక్రమాన్ని రుద్రమకోట గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సురేష్‌వైష్ణవి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరై గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సుభిక్షం, ప్రజల ఆయురారోగ్యాల కోసం మొక్కులు చెల్లించి ఆశీస్సులు పొందారు. అనంతరం గ్రామస్తులతో కలిసి బొడ్రాయి కార్యక్రమంలో పాల్గొన్న సురేష్‌వైష్ణవి దంపతులు గ్రామ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకు, సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనంగా నిలిచిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

# వేలాది మందికి వెలుగు పంచుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న

**ప్రజా సేవే లక్ష్యంగా 29వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విజయవంతం**



**ములుగు,జూన్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న కార్యాలయంలో నిర్వహించిన 29వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో వైద్య నిపుణుల బృందం ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ అవసరమైన వారికి తదుపరి చికిత్సల కోసం ఏర్పాట్లు చేశారు. ఉచిత కంటి ఆపరేషన్ల కోసం బాధితులను హైదరాబాద్‌లోని శంకర్ కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సుల ద్వారా తరలించే ఏర్పాట్లు చేశారు. గత రెండున్నర సంవత్సరాలుగా ములుగు జిల్లాలోని అన్ని మండలాల గ్రామీణ ప్రాంతాల్లో కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వృద్ధులు, నిరుపేదలకు భూక్య జంపన్న ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. అవసరమైన వారికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయించడంతో పాటు వైద్య ఖర్చుల భారం తగ్గించేలా సహకారం అందిస్తున్నారు. రాజకీయాలు ప్రజాసేవకు వేదిక కావాలని చెప్పడమే కాకుండా, ఆ మాటలను ఆచరణలో చూపిస్తున్న నాయకుల్లో భూక్య జంపన్న ఒకరని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి వైద్య శిబిరాలు నిర్వహించడం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులకు సహాయం చేయడం, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. గతంలో అమలైన “కంటికి వెలుగు” పథకం స్ఫూర్తితో ప్రస్తుతం స్వంత నిధులతో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు వెలుగు పంచుతున్నారని పలువురు ప్రశంసించారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువవుతూ నిజమైన ప్రజా నాయకుడిగా భూక్య జంపన్న గుర్తింపు పొందుతున్నారని శిబిరానికి హాజరైన ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న ప్రజలు భూక్య జంపన్నకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని కోరారు.

# మున్నూరుకాపు నేతలకు ఘన సన్మానం

**● వీహెచ్, బొమ్మా శ్రీరామ్ చక్రవర్తి, సర్దార్ పుటం పురుషోత్తంరావులకు అభినందనలు**




**హైదరాబాద్, ప్రతినిధి జూన్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** మున్నూరుకాపు సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రముఖులకు ఘన సన్మానం జరిగింది. బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ మాజీ సభ్యులు ఉత్పల హనుమంతరావు (వీహెచ్), మున్నూరుకాపు ఆర్థిక సహకార సంస్థ ఛైర్మన్ బొమ్మా శ్రీరామ్ చక్రవర్తి, వైస్ ఛైర్మన్ అల్లం భాస్కర్ నియమితులైన సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం ప్రత్యేక సన్మాన సభ నిర్వహించారు. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న సంఘ ప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆకుపచ్చ కండువాలు ధరించి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సభ ప్రాంగణం సందడిగా మారింది. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, సీనియర్ న్యాయవాది చెరుకూరి శేషగిరిరావు తదితరులు వీహెచ్, బొమ్మా శ్రీరామ్ చక్రవర్తి, సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమ రావులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. మున్నూరుకాపు సంఘం బలోపేతం, సామాజిక అభ్యున్నతికి మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. సంఘం ఐక్యత, అభివృద్ధి కోసం అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# నారాయణ పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా



**- అక్రమ పుస్తకాలు, స్టేషనరీ విక్రయాలపై గోడౌన్ సీజ్**

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలోని మమత హాస్పిటల్ రోడ్డులో ఉన్న నారాయణ కార్పొరేట్ పాఠశాల ఎదుట ఐసా, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, బీఎస్ఎఫ్ఐ, యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ), ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ పాఠశాల యాజమాన్యం స్వంత బ్రాండ్ పేర్లతో ముద్రించిన పుస్తకాలు, స్టేషనరీ వస్తువులను విద్యార్థులకు బలవంతంగా అధిక ధరలకు విక్రయిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఐసా జిల్లా కార్యదర్శి జమ్మి అశోక్, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాము, బీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ మాట్లాడుతూ... కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. విద్యార్థి సంఘాల ఆందోళన నేపథ్యంలో ఇంచార్జ్ ఎంఈఓ శైలజ సంఘటనా స్థలానికి చేరుకుని పాఠశాల ఆవరణలో ఉన్న పుస్తకాలు, స్టేషనరీ నిల్వ గోడౌన్‌ను పరిశీలించారు. ప్రాథమిక విచారణలో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించడంతో సంబంధిత గోడౌన్‌ను సీజ్ చేశారు. విద్యార్థి సంఘాలు సమర్పించిన ఆధారాల ఆధారంగా పూర్తి స్థాయి విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాలోని పలు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనల అమలుపై పర్యవేక్షణ లోపిస్తోందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, నారాయణ పాఠశాలలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం, ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ స్వంత బ్రాండ్ పుస్తకాలు, విద్యా సామగ్రి విక్రయిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని విద్యార్థి సంఘాలు కోరాయి. ఈ కార్యక్రమంలో ఐసా, యూఎస్ఎఫ్ఐ, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, బీఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు అండగా శివాయిగూడెం గ్రామం

**● పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహణ**





**రఘునాథపాలెం, జూన్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థుల విద్యాభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో రఘునాథపాలెం మండలం శివాయిగూడెం గ్రామంలో పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యకు ప్రాధాన్యతనిస్తూ గ్రామ సర్పంచ్ సునీత, ఉపసర్పంచ్ శారద రత్నకుమారి, కొమ్ము ఉమా స్కూల్ చైర్మన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే ప్రధాన ఆయుధమని, పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెంపొందించుకోవడంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహం అందించే ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. పుస్తకాలు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. “చదువే భవిష్యత్తుకు బాట.. విద్యార్థుల ప్రగతే గ్రామ ప్రగతి“ అనే సందేశంతో శివాయిగూడెంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలిచింది.

# గుర్తింపుకోసం ఎదురుచూసిన జీవితాలకు కొత్త వెలుగు

**● అన్నం సేవా ఫౌండేషన్ ఆశ్రయితులకు ఆధార్ నమోదు ● గుర్తింపు పత్రాల లేమితో సంక్షేమానికి దూరమైన నిరాశ్రయులకు న్యాయ సేవా సంస్థ చేయూత ● ఆధార్ ద్వారా గౌరవప్రద జీవనం, ప్రభుత్వ పథకాల ప్రాప్తి, కుటుంబాల ఆచూకీకి అవకాశం**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏళ్ల తరబడి గుర్తింపు లేకుండా, తమవారెవరో తెలియని అనిశ్చిత జీవితాలను గడుపుతున్న నిరాశ్రయులు, అనాథలు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న పలువురి జీవితాల్లో గురువారం కొత్త ఆశలు చిగురించాయి. ఖమ్మంలోని అన్నం సేవా ఫౌండేషన్‌లో నిర్వహించిన ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం వారి జీవితాలకు గుర్తింపుతో పాటు గౌరవప్రదమైన భవిష్యత్తుకు మార్గం సుగమం చేసింది. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి ఆదేశాలు, జిల్లా న్యాయ సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు (ఇన్‌చార్జ్), జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ జి.వి. మహేష్ నాథ్ మార్గదర్శకత్వంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవి మానస అన్నం సేవా ఫౌండేషన్‌ను సందర్శించి ఆశ్రయితుల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశ్రయితులలో చాలామందికి గుర్తింపు పత్రాలు లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు, న్యాయ సేవలు, ఇతర ప్రాథమిక హక్కుల ప్రాప్తిలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించారు. వెంటనే జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి ఆశ్రమంలోనే ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టరేట్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో ఆశ్రయితుల బయోమెట్రిక్ వివరాలను సేకరించి ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టారు. గతంలో ఆధార్ పొందిన వారి వివరాలు గుర్తిస్తే వాటిని తిరిగి పొందేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఆ వివరాల ఆధారంగా వారి అసలు గుర్తింపును నిర్ధారించి కుటుంబ సభ్యులను గుర్తించే అవకాశం కూడా ఉందని అధికారులు తెలిపారు. కుటుంబాల ఆచూకీ లభించిన వారిని తిరిగి వారి బంధువులతో కలిపేందుకు చర్యలు తీసుకోనుండగా, వివరాలు లభించని వారికి కొత్త ఆధార్ కార్డులు జారీ చేయనున్నారు. దీంతో వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సేవలు, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలు అందే అవకాశం ఏర్పడనుంది. ఈ సందర్భంగా పి. దేవి మానస మాట్లాడుతూ... “ఆధార్ అనేది కేవలం ఒక గుర్తింపు కార్డు మాత్రమే కాదు. సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న వ్యక్తులకు అది గౌరవప్రదమైన జీవనం, సంక్షేమ సేవలు, న్యాయ పరిరక్షణకు తలుపులు తెరిచే సాధనం” అని పేర్కొన్నారు. ఆధార్ నమోదు పూర్తయిన అనంతరం జాతీయ న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ న్యాయ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశ్రయితులకు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కులో గౌరవప్రదంగా జీవించే హక్కు కూడా అంతర్భాగమేనని, సమాజంలోని అత్యంత బలహీన వర్గాలకు గుర్తింపు, న్యాయ సహాయం, సంక్షేమ అవకాశాలు చేరేలా చూడటం న్యాయ సేవా సంస్థల బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. ఏళ్లుగా తమ గుర్తింపును కోల్పోయి, కుటుంబాల జాడ తెలియని పరిస్థితుల్లో జీవిస్తున్న పలువురు ఆశ్రయితులకు ఈ ఆధార్ నమోదు శిబిరం ఒక కొత్త జీవితానికి నాంది పలికింది. గుర్తింపు, గౌరవం, ప్రభుత్వ సహాయం, కుటుంబాలతో మళ్లీ కలిసే ఆశలను అందించిన ఈ కార్యక్రమం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అన్నం సేవా ఫౌండేషన్ అన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు, విత్తనాల దుకాణాలపై పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు...

**• నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు**





**సత్తుపల్లి, జూన్ (18 పిసిడబ్ల్యూ న్యూస్) :** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడడంతో పాటు నకిలీ విత్తనాలు, పురుగుమందుల విక్రయాలను అరికట్టేందుకు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో సత్తుపల్లి పట్టణంలో గురువారం విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి, వ్యవసాయ శాఖ ఇంచార్జి ఏవో సుజాత ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులను, నవతా ట్రాన్స్పోర్ట్ ను సందర్శించి, విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు.రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. అలాగే ప్యాకెట్లపై ఉన్న వివరాలు, తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులను మోసం చేసే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు లేదా నాసిరకం పురుగుమందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు చేపట్టేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు.రైతులు వ్యవసాయ సీజన్ ప్రారంభంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. బిల్లు లేకుండా కొనుగోలు చేసిన వస్తువుల విషయంలో భవిష్యత్తులో సమస్యలు తలెత్తితే చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని తెలిపారు. అలాగే అనుమానాస్పదంగా కనిపించే విత్తనాలు లేదా ఎరువుల గురించి వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## ఎస్‌సీసీఎల్ సిలో, బంకర్ వ్యవస్థలపై సబ్ కలెక్టర్ సమగ్ర తనిఖీ



**సత్తుపల్లి, జూన్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సత్తుపల్లి ప్రాంతంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) పరిధిలో గల సిలో బంకర్ మరియు సంబంధిత బొగ్గు నిర్వహణ వ్యవస్థలను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బొగ్గు లోడింగ్, నిల్వ, రవాణా ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించి, ఆయా వ్యవస్థల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు మరియు కార్యనిర్వహణ తీరును సమీక్షించారు. బొగ్గు ధూళి వ్యాప్తి నియంత్రణ, వాయు కాలుష్య నివారణకు చేపట్టిన చర్యలు, నీటి స్ప్రింక్లర్ వ్యవస్థలు, డస్ట్ సప్రెషన్ ఏర్పాట్లు, గ్రీన్ బెల్ట్ అభివృద్ధి కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లు నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, కాలుష్య నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, పరిసర ప్రాంత ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. సంబంధిత రికార్డులను పరిశీలించిన సబ్ కలెక్టర్, నిర్వహణలో నాణ్యత, పారదర్శకత, భద్రతా ప్రమాణాలను నిరంతరం పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ముస్లిం వార్డుల అభివృద్ధి, ఉర్దూ భాష అమలు, హలాల్ ఆహారంపై కలెక్టర్‌కు ఎఐఎంఐఎం వినతి

**కరీంనగర్ టౌన్ జూన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏఐఎంఐఎం కరీంనగర్ బృందం గురువారం జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ముస్లిం వార్డుల సమగ్ర అభివృద్ధి, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రభుత్వ బోర్డులలో ఉర్దూ భాషను చేర్చడం, అలాగే మైనారిటీ హాస్టళ్లలో ఆహార సరఫరా టెండర్లలో హలాల్ ఆహారాన్ని తప్పనిసరిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ అంశాలపై కలెక్టర్‌తో సవివరంగా చర్చించిన ఎఐఎంఐఎం ప్రతినిధులు, మైనారిటీలకు సంబంధించిన సమస్యలను వివరించారు. వినతిపత్రంలోని అంశాలను కలెక్టర్ శ్రద్ధగా విన్నారని, వాటికి తగిన ప్రాధాన్యత ఇచ్చి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మొహ్సిన్ మొహియుద్దీన్, అబ్బాస్ సమీ, సయ్యద్ బర్కత్ అలీ, అజహర్ దబీర్తో పాటు వార్డు అధ్యక్షులు నోమాన్ అహ్మద్, సమీ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.ప్రజల హక్కులు, సంక్షేమం మరియు మైనారిటీల అభివృద్ధి కోసం తమ ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతాయని ఎఐఎంఐఎం నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.



# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు దశలవారీ పోరాటం...



**నల్ల బ్యాడ్జీలతో ధర్నా.. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత...**

**సత్తుపల్లి, జూన్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నియోజకవర్గ కేంద్ర ఆర్‌సీ ఇన్‌చార్జ్‌లకు మండల స్థాయి అక్రిడేషన్ కార్డులు, జిల్లా బస్సు పాసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ యూనియన్లకు అతీతంగా సత్తుపల్లికి చెందిన జర్నలిస్టులు గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కు వినతిపత్రం అందజేసి, గతంలో అమలులో ఉన్న విధానంలోనే అక్రిడేషన్ కార్డులు, బస్సు పాసులు మంజూరు చేయాలని కోరారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందే శాశ్వత ప్రయోజనాలైన అక్రిడేషన్ కార్డులు, బస్సు పాసుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరైంది కాదని విమర్శించారు. బ్యూరోలు, డెస్క్ జర్నలిస్టులు, మండల విలేకరులను వేర్వేరుగా విభజించి, కార్డుల రంగుల్లోనూ తేడాలు చూపడం తగదన్నారు. జీవో నెం.252 జర్నలిస్టుల మధ్య చిచ్చు పెట్టిందని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను అనేక విధాలుగా విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న జర్నలిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కొన్ని జర్నలిస్టు సంఘాలు కూడా ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న విలేకరులకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. జర్నలిస్టులకు లభిస్తున్న ఏకైక రాయితీ అయిన బస్సు పాసులను కూడా పూర్తిస్థాయిలో ఇవ్వకుండా నిరోధించడం సమంజసం కాదన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో ముందుండాల్సిన సంఘాలు ప్రశ్నించే ధైర్యం చూపకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. గత 15 నుంచి 20 ఏళ్లుగా అమలులో ఉన్న విధానాన్ని కొనసాగిస్తూ నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న పత్రికల ఆర్‌సీ ఇన్‌చార్జ్‌లకు గుర్తింపు కల్పించి, జిల్లా అక్రిడేషన్‌తో పాటు రాష్ట్ర స్థాయి బస్సు పాసులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు న్యాయం జరగని పక్షంలో హక్కుల కోసం మరింత ఉధృతంగా పోరాటం చేస్తామని, అవసరమైతే యూనియన్ల నుంచి వైదొలగడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఉమాదిరాజు సుధాకర్, భీమిశెట్టి రాము, ఎండి షైబుద్దిన్, చీనేని బాలకృష్ణ, ఎస్కె ఖాదర్ బాబా, తోట కిరణ్, రామ్ శెట్టి లక్ష్మణరావు, తడికమల్ల దేవదానం, నిమ్మగడ్డ శ్రీకాంత్, రాజేష్ రెడ్డి, ఐ శ్రీను, ఆనంద్, జె శ్రీనివాస్, మోహన్, రామారావు, సురేష్, మెహరాజ్, సుధాకర్, గురవయ్య, రామకృష్ణ,గంగాధర్, రాంబాబు, అశోక్, చిరాంజీవి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఆంగ్లంలోనూ ముద్రించండి

**• జిల్లా కలెక్టర్‌కు.. ఎంఐఎం నేతల విజ్ఞప్తి..**



**కరీంనగర్ జూన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత ఎన్నికల సంఘం ప్రవేశపెట్టినటువంటి ఎస్ఐఆర్ ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి బిఎల్వోలు తీసుకొచ్చే ఎన్యుమరేషన్ ఫారాలు తెలుగు భాషతో పాటు ఆంగ్లంలోనూ ముద్రించి ఇవ్వాలని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తో పాటు ఆ పార్టీ కార్పొరేటర్లు నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్యూమరేషన్ ఫారాలను కేవలం తెలుగుకు మాత్రమే పరిమితం చేయడం వలన, ముఖ్యంగా పట్టణ, సెమీ–అర్బన్ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఓటర్లకు ఇబ్బందులు తలెత్తవచ్చని ఎంఐఎం నేతలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తెలుగులో అన్ని ఫారాలు ఉంటే ఉర్దూ మీడియం చదివిన వారికి అర్థం కాకుండా ఫారం నింపి ఇవ్వడంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని ఇంగ్లీషులో ముద్రించి అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో కార్పొరేటర్ సయ్యద్ ఇబ్రహీం, కార్పొరేటర్ మాజీద్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్ ఆరిఫ్ అహ్మద్, కంటెస్టెడ్ కార్పొరేటర్ అబ్దుల్ గఫార్, సురేష్, వాజిద్ అలీఖాన్, అదలా సేవా సంస్థ బాధ్యులు ముజీబ్ అయూబ్, ఎహ్ తేషామ్, నాయకులు వలి, అబ్దుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్ లతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాలుపంచుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని అన్నారు.అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా గుర్రంగుడ నుండి వర్చువల్ గా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన అరణ్య పార్క్ ల ప్రారంభోత్సవ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి తిలకించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీవో కె. శ్రీరామ్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, ఆర్టీవో సభ్యులు జి. వెంకన్న, అటవీ, వివిధ శాఖల అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు 100% స్కూల్ ఫీజు రాయితీ ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి ఆదేశాలు జారీ......



**మల్లంపల్లి మండల ప్రతినిధి జూన్ 18 (పి సి డబ్ల్యూ న్యూస్):** ఇటీవలే ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన TUWJ IJU ములుగు జిల్లా అధ్యక్షులు M.D.షఫీ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిదురాల వాసుదేవ్ యూనియన్ సభ్యులు సీనియర్ జర్నలిస్టులు ములుగు జిల్లాలోని అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 2026-2027 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 100% శాతం ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కీలక ఆదేశాలు జారీ చేశారు ఈరోజు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి ఆర్డర్ కాపీని TUWJ IJU ములుగు జిల్లా అధ్యక్షులు M.D.షఫీ అహ్మద్ కి అందజేశారు ఈ కార్యక్రమంలో కొమరయ్య రామ్మూర్తి రాజు వర్ధన్ మైపాల్ రెడ్డి హరినాథ్ వేణు యాదవ్ పొన్నాల స్వామి సతీష్ హరీష్ సతీష్ గౌడ్ తదితరులు సీనియర్ జర్నలిస్టు పాల్గొన్నారు.

## ముకర్రంపూరలో మంచినీటి కలుషిత సమస్యపై మున్సిపల్ అధికారుల తనిఖీ



**కరీంనగర్ టౌన్ జూన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా ముకర్రంపూర పరిసర ప్రాంతంలోని జోనల్ బ్యాంక్ వెనుక భాగంలో మంచినీరు కలుషితమవుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు.మున్సిపల్ ఫిట్టర్ ఫరూఖ్, లైన్‌మెన్‌లతో కలిసి ఇంటింటికీ వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. స్థానికుల నుంచి సమస్యకు సంబంధించిన వివరాలను సేకరించి, మంచినీటి పైపులైన్లు మరియు మురుగునీటి పారుదల వ్యవస్థను తనిఖీ చేశారు.సమస్యకు గల కారణాలను గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టి త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎఐఎంఐఎం కార్పొరేటర్ మహ్మద్ మజీద్ హుస్సేన్ మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. స్థానికులు సహకరించాలని ఆయన కోరారు.

# ఐపీఎల్ 2027 సీజన్‌ను ముందుకు జరిపే ఛాన్స్

## మార్చి 10 నుంచి మే 15 వరకు ముగింపు

### అవకాశాలు పరిశీలిస్తున్న బిసిసిఐ



**ముంబై,జూన్ 18:** వచ్చే ఐపీఎల్ సీజన్‌కు సంబంధించి కీలక విషయాలను బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. ఐపీఎల్ 2027 సీజన్‌ను మార్చి 10 నుంచి మే 15 వరకు నిర్వహించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మ్యాచుల సంఖ్య పెంపు విషయంలో ప్రస్తుతం ఎలాంటి చర్చ జరగలేదని పేర్కొన్నారు. తాజా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత వల్ల ఐపీఎల్ 20వ సీజన్‌ను ఇంకాస్త ముందుగా నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ‘ఈ సంవత్సరం ఐపీఎల్ సీజన్ మార్చి 28 నుంచి మొదలై మే 31న ముగిసింది. మే 15 తర్వాత టోర్నీ కీలక దశకు చేరుకుంది. ఇలాంటప్పుడు పలుచోట్ల వర్షాలు పడే అవకాశమూ ఉంది. ఇక ఎండల తీవ్రత కూడా కొన్ని ప్రాంతాల్లో ఆందోళన కలిగించే అంశమే. ఇటు ప్లేయర్లతోపాటు అటు ప్రేక్షకులూ ఆటను ఆస్వాదించేందుకు ఇబ్బంది అవుతుంది. ఈక్రమంలో ఐపీఎల్ గవర్నింగ్ బాడీతో బీసీసీఐ చర్చలు జరుపుతోంది. లీగ్‌ను ఇంకాస్త ముందుగానే ప్రారంభిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నాం. వచ్చే సీజన్ కోసం మార్చి 10 నుంచి మే 15 వరకు విండోను ఉంచాం. ప్లేఆఫ్స్, ఫైనల్‌కు వాతావరణం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనేదే మా ఉద్దేశం. ఎండల తీవ్రత గురించి మాకు అభిమానుల నుంచి చాలా ఫిర్యాదులు వచ్చాయి. ఇటు ఆటగాళ్లూ ఇబ్బందులు పడ్డారు. కాబట్టి వారందరికీ మంచి వాతావరణం అందించాల్సిన బాధ్యత మాపై ఉందని సైకియా తెలిపారు. ఇకపోతే ఇప్పటికిప్పుడు మ్యాచుల సంఖ్య పెంపు విషయంలో నిర్ణయం తీసుకోలేం. చాలా అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. వివిధ దేశాల నుంచి ఆటగాళ్లు వస్తారు. దీనికోసం దాదాపు రెండు నెలల పాటు షెడ్యూల్‌ను కేటాయించాల్సి ఉంటుంది. కొందరు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండటం కష్టమవుతోంది. ఇతర దేశాలకూ ద్వైపాక్షిక సిరీస్‌లూ ఉంటాయి. మ్యాచుల సంఖ్యను 74 నుంచి 94కు పెంచడంపై చర్చ జరగలేదు. భవిష్యత్తులో ఏం జరుగుతుందోఇప్పుడేచెప్పలేమని దేవజిత్ సైకియా వెల్లడించారు.




# వైభవ్ సూర్యవంశీకి బిసిసిఐ ఆఫర్

### - తల్లిదండ్రులతో ఇంగ్లడ్ పర్యటనకు అనుమతి

**ముంబై,జూన్ 18:** భారత క్రికెట్‌లో నయా సంచలనంగా ఎదుగుతున్న వైభవ్ సూర్యవంశీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు ఎంపికైన ఈ యువ బ్యాటర్‌తో పాటు అతడి తల్లిదండ్రులనూ అనుమంతించింది. వారి ప్రయాణ, వసతి ఖర్చులన్నింటినీ తామే భరిస్తామని బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ధ్రువీకరించారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న వైభవ్.. సీనియర్ ఆటగాళ్ల మధ్య సౌకర్యంగా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామ న్నారు. ’జాతీయ జట్టులో 14-15 ఏళ్ల ఆటగాడు ఉండటం చాలా అరుదు. గతంలో సచిన్ టెండూల్కర్ లాంటి ఆటగాడు చిన్న వయసులోనే భారత జట్టులోకి వచ్చాడు. ఇప్పుడు వైభవ్ కూడా అలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్నాడు. అక్కడి కొత్త వాతావరణ పరిస్థితులకు అతడు అలవాటుపడేందుకు తల్లిదండ్రుల సాన్నిహిత్యం ఉపయోగపడుతుంది’ అని సైకియా వివరించారు. ఐపీఎల్ సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన వైభవ్.. 776 పరుగులతో ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా 237కు పైగా స్ట్రైక్రేట్‌తో బ్యాటింగ్ చేసి మోస్ట్ వ్యాల్యూబుల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డులనూ సొంతం చేసుకున్నాడీ చిచ్చర పిడుగు. అతడి అద్భుత ఆటతీరును గుర్తించిన బీసీసీఐ.. భారత టీ20 జట్టులో అవకాశం కల్పించింది. కాగా.. దీనికంటే ముందు శ్రీలంకలో ప్రస్తుతం జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఏ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు వైభవ్.

# వన్డే ప్రపంచ కప్‌లో ఇషాన్‌కు చోటు ఖాయం


### - సునీల్ గవాస్కర్ ఆశాభావం



**ముంబై,జూన్ 18:** సౌతాఫ్రికా వేదికగా జరిగే 2027 వన్డే ప్రపంచ కప్ జట్టులో ఇషాన్ కిషన్ కచ్చితంగా చోటు దక్కించుకుంటాడని భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. ఇషాన్‌ను ఇప్పుడు జట్టు నుంచి తప్పించడం దాదాపు అసాధ్యమని పేర్కొన్నారు. ప్రపంచ కప్‌నకు ఎంపిక కావడానికి ఇప్పటికే సరిపడా ప్రదర్శనను అతను చేశాడని చెప్పారు. ‘ఇషాన్ కిషన్‌కు ఇప్పటికే దక్షిణాఫ్రికా వీసా వచ్చి ఉంటుందని నాకనిపిస్తోంది. అతడిని జట్టు నుంచి తప్పించాలంటే మరో ఆటగాడు అద్భుతమైన ప్రదర్శన చేయాల్సిందే. టీ20 ఫార్మాట్‌లో అతడు జట్టుకు ఎంతో కీలకమైన ఆటగాడు. పైగా చాలా బాగా బ్యాటింగ్ చేస్తున్నాడు. షాట్లు అద్భుతంగా ఆడుతున్నాడు. డిఫెన్స్ కూడా బాగుంది. బంతి షార్ట్‌గా వస్తే.. వెంటనే వెనక్కి జరిగి సిక్సర్లు కొడతాడు. గత ఏడాదిన్నర కాలంలో ఇషాన్ సంపూర్ణ ఆటగాడిగా మారాడు‘ అని గవాస్కర్ ప్రశంసలు కురిపించారు. ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ కూడా ఇషాన్ బ్యాటింగ్‌కు ఫిదా అయ్యాడు. అతడు నిజమైన టీమ్ మ్యాన్. మూడో స్థానంలో బ్యాటింగ్ చేయమని అడిగితే మొదటి మ్యాచ్‌లోలాగే విలువైన ఇన్నింగ్స్ ఆడతాడు. రెండో వన్డేలో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ అద్భుతమైన దూకుడు ప్రదర్శించాడు. భారత జట్టు జెర్సీ ధరించి ఆడుతున్నంత కాలం ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నాడనే దానితో సంబంధం ఉండదు. అది చాలా మంచి విషయం. ఎక్స్‌ట్రా కవర్ మీదుగా అతను కొట్టిన షాట్లు నాకు ఎంతగానో నచ్చాయని గ్రేమ్ స్వాన్ పేర్కొన్నాడు. అఎ÷-గానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో ఇషాన్ 79 బంతుల్లో 125 పరుగులు చేశాడు. అర్ధ శతకానికి 52 బంతులు తీసుకున్న అతను.. తర్వాత రెచ్చిపోయాడు. మరో 19 బంతులకే సెంచరీ మార్కును అందుకున్నాడు.


# ఫిఫా ప్రపంచకప్ 2026లో పోర్చుగల్ జట్టుకు ఊహించని షాక్

### ● ఆధిక్యతను అడ్డుకున్న కాంగో జట్టు



**న్యూఢిల్లీ,జూన్ 18:** ఫిఫా ప్రపంచకప్ 2026లో బలమైన పోర్చుగల్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. హ్యూస్టన్‌లోని ఎన్ఆర్జీ స్టేడియంలో జరిగిన గ్రూప్-కె మ్యాచ్‌లో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో(డీఆర్ కాంగో) జట్టు 1-1తో పోర్చుగల్‌ను నిలువరించింది. మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ, కాంగో పటిష్ఠ రక్షణ శ్రేణిని ఛేదించడంలో పోర్చుగల్ విఫలమైంది. మ్యాచ్ ప్రారంభమైన 6వ నిమిషంలోనే పోర్చుగల్ ఆటగాడు జోనో నెవ్స్ అద్భుతమైన ఫీల్డ్ గోల్‌తో జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, డిఫెండర్ విభాగాన్ని పటిష్ఠం చేసుకున్న కాంగో ఎదురుదాడికి దిగింది. ఈ క్రమంలో 44వ నిమిషంలో కాంగో స్టార్ యోనే విస్సా హెడర్ ద్వారా బంతిని నెట్‌లోకి పంపి స్కోరును 1-1తో సమం చేశాడు. రెండో అర్ధ భాగంలో పోర్చుగల్ బంతిని ఎక్కువసేపు తమ ఆధీనంలో ఉంచుకున్నప్పటికీ గోల్స్ చేయలేకపోయింది. ఈ మ్యాచ్ లో కాంగోపై గోల్‌తో పోర్చుగల్ యువ మిడ్‌ఫీల్డర్ జోవా నెవిస్ అరుదైన ఘనత సాధించాడు. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో గోల్ చేసిన మూడో అతి పిన్న వయస్కుడైన పోర్చుగీస్ ప్లేయర్‌గా నిలిచాడు. అతడు 21 ఏళ్ల 263 రోజుల వయసులో ఈ ఘనత సాధించాడు. అతడి కంటే ముందు ఈ జాబితాలో దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో(2006), రామోస్ (2022) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. మరోవైపు పోర్చుగల్ స్టార్ స్ట్రైకర్ క్రిస్టియానో రొనాల్డో ఈ మ్యాచ్‌లో పూర్తిగా నిరాశపరిచాడు. కాంగో డిఫెండర్లు అతడిని గట్టిగా మార్క్ చేయడంతో రొనాల్డోకు గోల్ చేసే అవకాశాలు దక్కలేదు. ఈ పేలవ ప్రదర్శనపై రొనాల్డో సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ’మేము అనుకున్న ఆరంభం ఇది కాదు. కానీ ఇక్కడితో అంతా అయిపోలేదు. తల ఎత్తి తదుపరి మ్యాచ్‌పై దృష్టి పెడతాం’ అంటూ అభిమానుల్లో నమ్మకాన్ని నింపాడు. మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ శుభారంభం చేసింది. గ్రూప్-ఎల్‌లో జరిగిన ఉత్కంఠభరిత పోరులో క్రొయేషియాపై 4-2తో విజయం సాధించింది. స్టార్ స్ట్రైకర్ హ్యారీ కేన్ రెండు గోల్స్‌తో మెరిసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

# సర్-2026 ఫారమ్‌లను ఆంగ్లంలోనూ అందుబాటులో ఉంచాలని డీఆర్వోకు వినతి




**కరీంనగర్ టౌన్ జూన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):**
కరీంనగర్ మైనారిటీ చైర్మన్ మహమ్మద్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం గురువారం జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ)ను కలిసి సర్-2026 కార్యక్రమానికి సంబంధించి వినతిపత్రాన్ని సమర్పించింది. వినతిపత్రంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలో అందుబాటులో ఉన్న విధంగా, కరీంనగర్ జిల్లాలో కూడా ఎన్యుమరేషన్ ఫారమ్‌లను తెలుగు భాషతో పాటు ఆంగ్ల భాషలో అందుబాటులో ఉంచాలని కోరారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు, ఉద్యోగ నిపుణులు మరియు ఇతర ఓటర్లు ఫారమ్‌లను సులభంగా నింపేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే ఆంగ్ల భాషలో ఫారమ్‌లు అందుబాటులో ఉంటే సమాచారం నమోదు సమయంలో జరిగే పొరపాట్లు తగ్గడంతో పాటు, మరింత మంది ఓటర్లు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం అయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ విజ్ఞప్తిని ఎన్నికల అధికారులు సానుకూలంగా పరిశీలించి, ఆంగ్ల భాషలో కూడా ఫారమ్‌లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఓటరు జాబితాల ఖచ్చితత్వం పెరగడంతో పాటు ప్రజల భాగస్వామ్యం మరింత విస్తృతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ రహ్మాన్ మరియు ఎం.ఏ. జమీల్ కూడా పాల్గొన్నారు.

# టీజీ20 లీగ్‌కు ప్రచారం..

### ● సిరాజ్, తిలక్ వర్మ, విజయ్ దేవరకొండకు నోటీసులు..!



భారత క్రికెటర్లు సిరాజ్, తిలక్ వర్మ, సినీ హీరో విజయ్ దేవరకొండకు తెలంగాణ క్రికెట్ సంఘం నోటీసులు పంపింది. హైదరాబాద్ క్రికెట్ సంఘం నిర్వహించ తలపెట్టిన తెలంగాణ టీ20 లీగ్(టీజీ20)కు ప్రచారం కల్పిస్తున్నారనే ఆరోపణలతో వీరికి లీగల్ నోటీసులు జారీ చేసింది. క్రికెటర్లతో పాటు పలువురు సినీ తారలకు నోటీసులు పంపామని టీసీఏ జనరల్ సెక్రటరీ గురవా రెడ్డి వెల్లడించాడు. భారత క్రికెట్ నియంత్రణ మండలి అనుమతి లేని టీజీ20కి ప్రచారం చేయడం అక్రమమని పేర్కొన్న టీసీఏ చర్యలకు ఉపక్రమించింది. టీసీఏ నుంచి నోటీసులు అందుకున్న వారిలో క్రికెటర్లు సిరాజ్, తిలక్‌తో పాటు మాజీ ఆటగాడు అంబటి రాయుడు, టాలీవుడ్ హీరోలు విజయ్ దేవరకొండ, వెంకటేశ్ దగ్గుబాటిలు ఉన్నారు.




## వెంకీ-కల్యాణ్ రామ్ మల్టీస్టారర్..

### అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైనర్ గ్రాండ్ లాంచ్

టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తి రేపుతున్న భారీ మల్టీస్టారర్ చిత్రానికి ఈరోజు అధికారికంగా అంకురార్పణ జరిగింది. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ చిత్రానికి సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా పూజా కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్రరావు, నిర్మాత అల్లు అరవింద్ వంటి సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఈ సినిమాలో కథానాయికల వివరాలను కూడా చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. వెంకీ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన టాలెంటెడ్ బ్యూటీ కృతి శెట్టి నటించనుంది. దగ్గుబాటి, నందమూరి హీరోల కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్ర నిర్మాణంలో సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంస్థలు భాగస్వామ్యం వహిస్తున్నాయి. జాతీయ అవార్డు విజేత జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

## విజయ్ కేవలం స్క్రీన్ హీరో మాత్రమే కాదు: సమంత ప్రశంసలు



తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నటుడు జోసెఫ్ విజయ్‌ను ప్రముఖ నటి సమంత రూత్ ప్రభు బుధవారం చెన్నైలో కలిశారు. విజయ్ కేవలం వెండితెరకే పరిమితమయ్యే కథానాయకుడు కాదని, అంతకుమించిన గొప్ప బాధ్యతలను నిర్వర్తించేందుకే ఆయన జన్మించారని ఈ సందర్భంగా ఆమె అభిప్రాయపడ్డారు. ఈ భేటీ అనంతరం ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్టును పంచుకున్నారు. "చెన్నైలో అడుగుపెట్టగానే ఈరోజు అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. మన ముఖ్యమంత్రిని కలవబోతున్నానన్న ఆలోచన ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. విజయ్ సార్ కేవలం వెండితెర హీరోగా మాత్రమే ఉండాల్సిన వ్యక్తి కాదని నాకు ఎప్పుడూ అనిపిస్తుండేది. ఆయనకున్న ప్రజాబలం, ప్రజలు ఆయన పట్ల చూపే ఆదరణ చూస్తుంటే, ఆయన ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాల్సిన వ్యక్తి అని నా నమ్మకం" అని సమంత తన పోస్టులో పేర్కొన్నారు. అత్యున్నత స్థాయిలో ఉన్న సినీ కెరీర్‌ను వదులుకుని, ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టడం సామాన్యమైన విషయం కాదని, అందుకు ఎంతో ధైర్యం కావాలని ఆమె కొనియాడారు. "అటువంటి సవాలును స్వీకరించే సాహసం కొందరికే ఉంటుంది. తనను నమ్మిన వారి అంచనాలను ఆయన కచ్చితంగా అధిగమిస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని ఆమె తెలిపారు. ఈ నూతన ప్రయాణంలో విజయ్‌కు సంపూర్ణ శక్తి, వివేకం, ధైర్యం చేకూరాలని ఆమె ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ మొత్తం 234 స్థానాలకు గాను 108 సీట్లను సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ క్రమంలోనే ఆయన మే 10న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో 2016లో విడుదలైన 'తెరి' చిత్రంలో విజయ్, సమంత కలిసి నటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సమంత, నందిని రెడ్డి దర్శకత్వంలో 'మా ఇంటి బంగారం' అనే చిత్రంలో నటిస్తున్నారు.



## ఫేడౌట్ అనుకుంటే బౌన్స్ బ్యాక్..

టాలీవుడ్ లో హీరోయిన్ల కెరీర్ గ్రాఫ్ ఎప్పుడు ఎలా మారుతుందో అంచనా వేయడం చాలా కష్టం. ఒకట్రెండు ఫ్లాపులు పడినా లేదా కాస్త గ్యాప్ వచ్చినా ఇక ఫేడౌట్ అయిపోయారని ఈజీగా డిసైడ్ చేసేస్తారు. టాలెంటెడ్ బ్యూటీ నివేదా పేతురాజ్ విషయంలో కూడా రీసెంట్ గా ఇలాంటి కామెంట్స్ గట్టిగానే వినిపించాయి. తెలుగులో ఆమెకు అవకాశాలు దాదాపు తగ్గిపోయాయనే టాక్ నడుస్తున్న టైమ్ లో.. సడెన్ గా రెండు భారీ ప్రాజెక్ట్స్ లైన్ లో పెట్టి ఇండస్ట్రీకి పెద్ద షాక్ ఇచ్చింది. గతంలో మెంటల్ మదిలో, చిత్రలహరి, బ్రోచేవారెవరురా, అల వైకుంఠపురములో లాంటి సక్సెస్ ఫుల్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్ కు ఆ తర్వాత ఆశించిన స్థాయిలో సరైన బ్రేక్ రాలేదు. ఆమె కెరీర్ పూర్తిగా స్లో అయిపోయినట్లే అనిపించింది. రీసెంట్ గా వచ్చిన సింగ్ గీతం సినిమాలో కూడా ఆమె కేవలం ఒక చిన్న క్యామియో రోల్ కే పరిమితం అయింది. దీంతో ఆల్మోస్ట్ ఆమె కెరీర్ గ్రాఫ్ పడిపోయిందా అనేలా కామెంట్స్ వచ్చాయి. కానీ ఆమె ప్లానింగ్ వేరేలా ఉంది. విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో రాబోతున్న ఆదర్శ కుటుంబం సినిమాలో నివేదా ఒక క్రేజీ ఛాన్స్ దక్కించుకుని అందరి దృష్టి తనవైపు తిప్పుకుంది. త్రివిక్రమ్ సినిమాల్లో లేడీ క్యారెక్టర్స్ కు ఎంత ఇంపార్టెన్స్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ ప్రాజెక్ట్ లో ఆమె రోల్ చాలా పవర్ ఫుల్ గా, సెకండ్ హాఫ్ లో కథను మలుపు తిప్పేలా ఉండబోతోందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది.


'మెగా 158'లో నివేదా



## నేటి నుంచి 'పెద్ది'లో మరో ఆరు నిమిషాల కొత్త సన్నివేశాలు

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' చిత్రంలో కీలక మార్పులు చేశారు. విడుదలై రెండు వారాలు పూర్తయిన నేపథ్యంలో ప్రేక్షకులకు మరింత మెరుగైన అనుభూతి కల్పించేందుకు చిత్రంలో కొత్త సన్నివేశాలను జోడిస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. గురువారం నుంచి థియేటర్లలో ప్రదర్శించే వెర్షన్‌లో అదనంగా 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల కొత్త ఫుటేజీని చేర్చనున్నారు. దీంతో సినిమా నిడివి మరింత పెరగనుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. కొత్త సన్నివేశాలతో 'పెద్ది' అనుభూతి మరింత మెరుగవుతుందని పేర్కొంది.

ఇటీవల జాన్వీ కపూర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రం నుంచి తొలగించారనే వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో కొత్త ఫుటేజీని జోడించడం ఆసక్తికరంగా మారింది. అయితే కొత్తగా చేర్చిన సన్నివేశాల్లో ఏమి ఉంటాయనే విషయాన్ని నిర్మాతలు వెల్లడించలేదు. మరోవైపు, గురువారం నుంచి ఈ చిత్రాన్ని సాధారణ టికెట్ ధరలతో ప్రదర్శించనున్నారు. దీంతో ప్రేక్షకుల ఆదరణ మరింత పెరిగే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. జూన్ 4న విడుదలైన 'పెద్ది'కి తొలి రోజుల్లో మంచి స్పందన లభించింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో ఈ చిత్రం బలమైన వసూళ్లు సాధించింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం 14వ రోజున దేశవ్యాప్తంగా రూ.2.45 కోట్ల నికర వసూళ్లు రాబట్టిన ఈ సినిమా మొత్తం ఇండియా నెట్ కలెక్షన్లు రూ.226 కోట్లకు చేరాయి. గ్రాస్ వసూళ్లు రూ.267 కోట్లకు పైగా నమోదైనట్లు సమాచారం. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందన మధ్య ప్రదర్శితమవుతున్న ఈ చిత్రానికి కొత్త సన్నివేశాలు ఎంతవరకు కలిసివస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

## తిరుమల కొండపై సందడి చేసిన 'మా ఇంటి బంగారం' టీమ్



స్టార్ హీరోయిన్ సమంత నటించిన 'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమైన వేళ, చిత్ర బృందం తిరుమల శ్రీవారి ఆశీస్సులు తీసుకుంది. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో చిత్ర యూనిట్ సభ్యులు శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. నటి సమంత, ఆమె భర్త, చిత్ర నిర్మాత అయిన రాజ్ నిడిమోరు, దర్శకురాలు నందిని రెడ్డి, నటి-యాంకర్ శ్రీముఖి తదితరులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న చిత్ర బృందానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వారికి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

నందిని రెడ్డి దర్శకత్వంలో ఫ్యామిలీ యాక్షన్ కామెడీ డ్రామాగా తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రం రేపు జూన్ 19న (శుక్రవారం) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. సినిమా విడుదలకు ఒక్కరోజు ముందు చిత్ర విజయం కోసం స్వామివారిని ప్రార్థించినట్లు చిత్ర బృందం తెలిపింది. ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్, ప్రమోషన్లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి.

## 'డ్రాగన్'లో నీల్ నెక్స్ట్ లెవెల్ ప్లాన్.. ఫ్యాన్స్‌కు ఫుల్ ఫీస్ట్!



మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, కేజీఎఫ్ ఫేమ్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ప్యాన్-ఇండియా మూవీ 'డ్రాగన్'. ఇటీవలే ఎన్టీఆర్ బర్త్ డే కానుకగా వచ్చిన గ్లిమ్స్ సోషల్ మీడియాను ఎలా షేక్ చేసిందో మనందరికీ తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా తాజాగా ఈ మూవీ నెక్స్ట్ షెడ్యూల్‌కు సంబంధించి ఒక మైండ్ బ్లోయింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ క్రేజీ న్యూస్ విన్న నందమూరి ఫ్యాన్స్ ఇప్పుడే థియేటర్లలో పూనకాలు గ్యారెంటీ అని ఫిక్స్ అయిపోతున్నారు. ఆ విశేషాలు చూద్దాం..

**శ్రీలంక కొండల్లో హై-ఓల్టేజ్ యాక్షన్:**

ప్రస్తుతం డ్రాగన్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఇక టీమ్ ముఖ్యమైన సీన్లు షూట్ చేస్తున్నారు. డ్రాగన్ తదుపరి భారీ షెడ్యూల్ కోసం చిత్ర యూనిట్ మొత్తం శ్రీలంకకు పయనం కానుంది. ప్రశాంత్ నీల్ మార్క్ యాక్షన్ సీన్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో మనకు తెలుసు. ఇక శ్రీలంకలోని అద్భుతమైన, కనువిందు చేసే లొకేషన్లలో ఎన్టీఆర్‌పై కొన్ని మైండ్ బ్లాంక్ అయ్యే హై-ఓల్టేజ్ యాక్షన్ సీన్లను ప్లాన్ చేశారు నీల్. వచ్చే నెలలో ప్రారంభం కాబోయే ఈ భారీ షెడ్యూల్‌తో సినిమాకు సంబంధించిన ఒక మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ అవ్వబోతోందని సమాచారం.: ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కన్నడ క్రష్, బ్యూటిఫుల్ నటి రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే బాలీవుడ్ ఎవర్‌గ్రీన్ స్టార్ అనిల్ కపూర్, మలయాళ వర్సటైల్ యాక్టర్ బిజూ మీనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ భారీ క్యాస్టింగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచేస్తోంది. ఈ చిత్రానికి కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా ఎన్టీఆర్ ఆర్ట్స్ మరియు మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.